ఇంటింటా క్యాన్సర్ పరీక్షలు

- ఈనెల 14న ప్రారంభించిన ఆరోగ్య శాఖ
- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు
- జిల్లాలో 23,77,223 మంది వైద్య పరీక్షలకు అర్హులు
- 9 నెలల పాటు కొనసాగనున్న క్యాన్సర్ స్క్రీనింగ్



గోస్పాడులో సర్వే చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది



క్యాన్సర్ స్క్రీనింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా అధికారి కాంతారావు నాయక్

గోస్పాడు: రాచపుండుకు అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందిని. ముందే గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. తగు జాగ్రత్తలతో ముందుకు సాగితే క్యాన్సర్‌ను జయించడం కష్టమేమీ కాదంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై విజయం – స్క్రీనింగ్ సాధ్యం అనే కార్యక్రమాన్ని ఈనెల 14న ప్రారంభించారు. ఇంటి వద్దే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ స్థానిక ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక యాప్ రూపొందించారు.

రోగ నిర్ధారణకు దోహదం

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం క్యాన్సర్, దాని ప్రారంభం చాలా ఆలస్యంగా గుర్తిస్తున్నట్లు వెల్లడైంది. ఫలితంగా రోగ నిర్ధారణ ఆలస్యమవుతుంది. దీంతో సంబంధిత వ్యక్తుల మరణాలకు దారితీస్తుంది. క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోవాలంటే ముందస్తుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ కణాలను గుర్తించడం ద్వారా మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు. ఒక వ్యక్తిలో ఏదైనా లక్షణం కనిపించక ముందే క్యాన్సర్ కణాల కోసం వెతకడాన్నే క్యాన్సర్ స్క్రీనింగ్ అని పిలుస్తారని వైద్యులు చెబుతున్నారు.

ప్రత్యేక యాప్‌లో నమోదు

క్యాన్సర్ లక్షణాలు ప్రాథమిక స్థాయిలో గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. వివరాలను అందులోనే నమోదు చేస్తున్నారు. ఆయుష్మాన్ భారత్ సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త కలిసి ఇంటింటికీ వచ్చి ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు వారి ఆహారపు అలవాట్లుతో పాటు యాప్‌లో ఉన్న పలురకాలకు సంబంధించిన విషయాలను నమోదు చేస్తున్నారు. కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ పరీక్షలు చేసి, 30 సంవత్సరాలు నిండిన మహిళలకు ఆరోగ్య సమస్యల్లో నెలసరి వివరాలు, దంత క్షయాలు (నోటి కుహరం) మహిళల్లో గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్ల వంటి సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు. వీటితోపాటు బీపీ, షుగర్, హెమగ్లోబిన్ వంటి పరీక్షలను నిర్వహిస్తున్నారు.

గుర్తించడం ఎలా..?

మానకుండా ఉన్న పుండ్లు. శరీరంలోని ఏ భాగంలోనైనా ఎదుగుతున్న గడ్డలు, కణుతులు, అసహజమైన రక్తస్రావం, పెరుగుతున్న పుట్టుమచ్చలు, పులిపిరి కాయలు, మింగటం కష్టంగా ఉండటం, గొంతు బొంగురుపోయి తగ్గకుండా ఉండటం, చాలా రోజులుగా ఉన్న అజీర్ణవ్యాధి తదితర లక్షణాలు ఉంటే తక్షణమే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

మాంసాహారాల్లో క్యాన్సర్ కణాలు

తాజా కూరగాయలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి.వీటిల్లో క్యాన్సర్ కారకాలతో పోరాడే యాంటిజెంట్స్ ఉంటాయి. మాంసాహారాల్లో క్యా న్సర్ కణాలు అధికంగా ఉంటాయి. ఇవి తినే వారు తప్పనిసరిగా వెజిటబుల్ లేదా ఫ్రూట్ సలాడ్ తి నాలి. దీనివల్ల మాంసాహారంలో ఉండే క్యాన్సర్ కణాలతో సలాడ్‌లోని యాంటిజెంట్స్ పోరాడతాయి.

జిల్లాలో పరిస్థితి ఇలా...

జిల్లాలోని 29 మండలాలతో పాటు పట్టణాలోల్ వైద్య సిబ్బంది అంచనా ప్రకారం 18 ఏళ్లు నిండిన వారు 13,24,372 కాగా 30 ఏళ్లు నిండిన వారు 10,52,851 మంది ఉన్నారు. వీరికి 2500 మంది వైద్య సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రాథమిక లక్షణాలు గుర్తించిన వారిని స్థానిక వైద్యులు రిఫర్ చేస్తూ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక క్యాన్సర్ వైద్య శిబిరాలకు పంపించి వైద్యం అందిస్తామని చెబుతున్నారు. 9 నెలల పాటు ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కొన సాగనుందని వైద్యశాఖాదికారులు పేర్కొంటున్నారు.

24లక్షల మందికి పరీక్షలు చేస్తాం



జిల్లాలో 18, 30 సంవత్సరాలు నిండిన 24 లక్షల మందికి పరీక్షలు నిర్వహించనున్నాం. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలు గుర్తించడంతో పాటు ప్రజలకు ఈ పరీక్షలతో సత్ఫలితాలు పొందవచ్చు. జిల్లా అంతటా కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాం. స్క్రీనింగ్ పరీక్షలకు అవసరమైన పరీక్షలకు సంబంధించిన పరికరాలను సిబ్బందికి అందించాం.

–వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్) : ప్రదానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులకు ఇచ్చే రెసిడెన్షియల్ శిక్షణను రద్దు చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎం.షరీఫ్, అధికార ప్రతినిధి వీరబ్రహ్మం డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఆయా జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, పాత పద్ధతిలోనే జరిపేలా ఉత్తర్యులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పదవ తరగతి పరీక్షల నామినల్ రోల్ తయారు చేయుట, ఫీజుచెల్లించుట, అపార్‌కార్డుల పనుల ఒత్తిడి ఉన్నందున శిక్షణను వాయిదా వేయాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు అర్జీలు అందజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



నూతన కమిటీతో నాయకులు

నంద్యాల(న్యూటౌన్): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు కనీస వేతనం అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం, కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ సెంటర్లలో పనిచేసే డ్రైవర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అనంతరం తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహమ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా కిషన్ కుమార్, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా చంద్రమౌళిని ఎన్నుకోగా కమిటీ సభ్యులుగా ఖాదర్‌బాషా, రాజేంద్ర ప్రసాద్, విజయకుమార్, రామచంద్రుడు తదితరులను ఎన్నుకున్నారు.

23న బీసీల రాష్ట్ర మహాసభ

నంద్యాల(అర్బన్): ఈనెల 23న కర్నూలులోని ఆదర్శ విద్యా జూనియర్ కళాశాలలో బీసీ శంఖారావం, వనభోజన రాష్ట్ర మహాసభను నిర్వహిస్తున్నట్లు బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రాంబాబు, బోయ సాధికారిక జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ఆదివారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో రాష్ట్ర మహాసభ గోడ పత్రికలను సంఘం నేతలతో కలిసి విడుదల చేశారు. గోవింద నాయుడు,రాము, రైల్వే శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



మాట్లాడుతున్న కిశోర్ కుమార్

నంద్యాల(న్యూటౌన్) : కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజేషన్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల జిల్లా అసోసియేషన్ ఐక్యవేదిక జేఏసీ చైర్మన్ కిశోర్ కుమార్, కో చైర్మన్ నాగమురళీ మోహన్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ మహిళా కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకుల ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నేడు శ్రీశైలం ఈఓ బాధ్యతల స్వీకరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా నియమితులైన ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు దేవస్థాన అధికార వర్గాలు తెలిపారు. ప్రస్తుతం ఆజాద్ తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 2014లో ఆజాద్ శ్రీశైలం ఈఓగా విధులు నిర్వహించారు.

బిల్వ పత్రాలపై కార్తీక శోభ



బిల్వ పత్రాలపై కోటేష్ వేసిన చిత్రాలు

నంద్యాల(అర్బన్) : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ ఆదివారం మూడు బిల్వ పత్రాలపై కార్తీక శోభను చాటేలా చిత్రించారు. పరమ శివునికి అత్యంత ప్రీతికరమైన మాసం కార్తీకమాసమని,శివయ్యకు బిల్వ పత్రాలంటే ఇష్టమని, అందుకే బిల్వ పత్రాలపై కార్తీక శోభను సూక్ష్మ చిత్రాలతో చిత్రాలను గీశానని చెప్పారు. ఒక పత్రంపై పరమశివుడు భక్తులను దీవిస్తున్నట్లు, రెండవ పత్రంపై ద్వాదశ జ్యోతిర్లింగాలు, మూడవపత్రంపై శివాలయం ప్రకృతి దృశ్యాలును చిత్రించారు.

వేగంగా.. సులభంగా..



డ్రోన్‌తో కంది పంటలో మందు పిచికారీ

దొర్నిపాడు: చీడపీడల నివారణ కోసం పంటలకు మందు పిచికారీ చేయాలంటే రైతులు గతంలో చాలా ఇబ్బందులు పడేవారు. కంది, వరి, పత్తి, జొన్న పంటలకు రసాయన మందులు స్ప్రే చేయాలంటే రైతులు మందువాసనకు ప్రాణాల మీదకు తెచ్చుకున్న ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం డ్రోన్ సాయంతో రైతులు వేగంగా, సులభంగా మందును పిచికారీ చేయించుకుంటున్నారు. రైతుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డ్రోన్ నిర్వాహకులు ఫోన్ చేస్తే సరి రైతుల పనులు చేసి వెళ్తున్నారు. ఎకరం పొలంలో మందు పిచికారీ చేయాలంటే గతంలో గంటల సమయం పట్టేదని.. ప్రస్తుతం కేవలం 10 నిమిషాల్లో పూర్తవుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహానందిలో సండే సందడి



మహానందీశ్వరస్వామి దర్శనార్థం క్యూలో వేచి ఉన్న భక్తజనం

మహానంది: కార్తీకమాసం, ఆదివారం సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఈఓ నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి, ఏఈఓ ఎరమల మధు, ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, శ్రీనివాసప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం వేళలో దర్శనానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక డొనేషన్ కౌంటర్ వద్ద పాలు పంపిణీ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ నిర్విరామంగా కొనసాగింది.

ఒకే నంబర్ టికెట్లపై కమిషనర్ ఆరా !

మహానంది: మహానంది దేవస్థానంలో టికెట్ల జారీలో గోల్‌మాల్ జరిగిందన్న విషయంపై దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ సత్యనారాయణ ఆరా తీసినట్లు సమాచారం. ఒకే నంబరుతో రెండేసి చొప్పున టికెట్లు వచ్చినట్లు ఆదివారం ప్రచారం జరిగింది. అయితే గోల్‌మాల్, ఎలాంటి అవినీతి జరగలేదని ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి విలేకరులకు తెలిపారు. ఈ నెల 9వ తేదీన, 12వ తేదీన ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లలో సాంకేతిక కారణాలు తలెత్తడంతో కంప్యూటర్ల ద్వారా కాకుండా పీఓఎస్ మిషన్ల ద్వారా టికెట్లు జారీ చేశారన్నారు. అలా టికెట్లు జారీ చేసే సమయంలో సాంకేతిక లోపాలతో ఒకే నంబరుతో ఒకే సమయంలో రెండేసి చొప్పున టికెట్లు వచ్చాయన్నారు.

శ్రీశైలంలో భక్తులకు విస్తృత సేవలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత సేవలు అందిస్తున్నామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. హోంగార్డు నుంచి డీఎస్పీ స్థాయి వరకు ఒక టీంగా విధులు నిర్వహించి ఎలాంటి అవాంతరాలు లేకుండా కార్తీకపౌర్ణమి ఉత్సవాలను విజయవంతం చేశామన్నారు. భక్తులకు, వాహనదారులకు అంతరాయం లేకుండా 10 బ్లూకోర్ట్ వాహనాలు, 4 రక్షక్ పెట్రోలింగ్, రెండు టోయింగ్ వాహనాలు, కమాండ్ కంట్రోల్‌రూం , డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతూ ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నామని చెప్పారు. అలాగే హైదరాబాద్–విజయవాడ రహదారుల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా తగుచర్యలు చేపట్టామన్నారు. కార్తీకమాసమంతా పోలీసు బందోబస్త్ కొనసాగుతుందని తెలిపారు.

మహానందిలో ఆర్అండ్‌బీ సీఈ పూజలు



సీఈ బుచ్చిరాజుకు జ్ఞాపిక అందిస్తున్న అధికారులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో రహదారులు, భవనాల శాఖ ఎలక్ట్రికల్ విభాగం సీఈ బుచ్చిరాజు ఆదివారం పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ పర్యవేక్షకులు అంబటి శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం ఆలయ అలంకార మండపంలో వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు, స్వామివారి మెమోంటో అందించి వేదాశీర్వచనం చేశారు. వారి వెంట ఈఈ ఝాన్సిరాణి, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాజనకంగా కంది పంట



ఆర్.పాంపల్లె సమీపంలో పూత దశలో ఉన్న కంది పంట

ఉయ్యాలవాడ: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంట ప్రస్తుతం పూత దశలో ఆశాజనకంగా ఉంది. తుపాన్ ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న, సీడు పత్తి, మినుము, వరి, పొగాకు, తదితర పంటలు అతి వృష్టి, అనావృష్టి కారణంగా దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే ప్రస్తుతం కురిసిన వర్షాలు కంది పంటకు అనుకూలించడంతో రైతుల్లో కొంత మేరకు ఆశలు రేకెత్తిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కంది పంట వేపుగా పెరిగింది. గత ఏడాది మండలంలో కంది సాగు విస్తీర్ణం 295 హెక్టార్లు కాగా, ఈ ఏడాది 805 హెక్టార్లలో సాగు చేశారు. ఉయ్యాలవాడ, హరివరం, పడిగెపాడు, ఆర్.పాంపల్లె, కొండుపల్లె, ఆర్.జంబులదిన్నె, తదితర గ్రామాల్లో అధిక శాతం రైతులు కంది పంట సాగుపై ఆసక్తి కనబరిచారని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం కంది దిగుబడులకు మార్కెట్‌లో క్వింటా రూ.10వేల వరకు పలుకుతోంది. మరి కొద్ది రోజుల్లో వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదపుటంచులో పశువైద్యశాల



శిథిలావస్థకు చేరుకున్న కోటపాడు పశు వైద్యశాల



పెచ్చులూడిన భవనం పైకప్పు

శిరివెళ్ల: కోటపాడు పశు వైద్యశాల శిథిలావస్థకు చేరకుని ప్రమాదపుటంచులో ఉంది. భవనం పైకప్పు, గోడలు బీటలు వారాయి. పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో సిబ్బంది, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కోటపాడు, వీరారెడ్డిపల్లె గ్రామాలకు 1981లో పశు వైద్యశాల నిర్మించారు. ఈ రెండు గ్రామాల్లో 910 పశు సంపద ఉంది. అందులో 150 మేకలు, 956 గొర్రెలు ఉన్నాయి. శిథిలావస్థకు చేరుకున్న పశు వైద్యశాల స్థానంలో నూతన భవనం నిర్మించాలని రైతులు చాలా కాలంగా కోరుతున్నా ఫలితం లేదు. ఈ ఏడాడి మార్చిలో పశు వైద్యశాల ప్రాంగణంలో గ్రామ సచివాయం, రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవాలకు అప్పటి ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాద్ వచ్చారు. పశువైద్యశాల దుస్థితిని గ్రామ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. త్వరలో నూతన భవనం మంజూరుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంతో నూతన భవన మంజూరు ప్రశ్నార్థకంగా మారింది. కూటమి నాయకులు పట్టించుకోకపోవడంతో పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కోసం ఎదురు చూస్తున్నాం

జిల్లాలో చాలా పశు వైద్యశాలలు దెబ్బతిన్నాయి. బడ్జెట్ కోసం ఎదురు చూస్తున్నాం. నిధులు రాగానే భవనాలకు మరమ్మతులు, నూతన భవనాల నిర్మాణాలు మొదలవుతాయి. అందులో కోటపాడు పశు వైద్యశాల కూడా ఉంది.

–గోవిందనాయక్, జేడీ

దివ్యాంగుని కుటుంబానికి చేయూత



బాధితునికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: మండలంలోని అహోబిలం గ్రామానికి చెందిన దివ్యాంగుడు క్రిష్ణ నివాసం ఉంటున్న పూరిగుడిసె కాలి బూడిదయ్యింది. దీంతో కట్టుబట్టలతో వీధిన పడ్డ ఆయన కుటుంబానికి ఆళ్లగడ్డ బ్లడ్ డోనర్స్ టీం అండగా నిలిచింది. ఆదివారం బియ్యం ప్యాకెట్లతో పాటు నిత్యావసర సరుకులను అందజేసింది. దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని కోరారు. మహమ్మద్ హుసేన్, హరీష్, బాషా, శివ, సాయి సద్దాం, నూరుల్లా, శివ, మహబూబ్‌బాషా సర్దార్ తదితరులు ఉన్నారు.

శ్రీశైలం దేవస్థానం ఈఈగా బాలమురళీకృష్ణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పి.బాలమురళీకృష్ణను నియమిస్తూ దేవదాయశాఖ అధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన వీరవెంకట సత్యనారాయణ స్వామి వార్ల దేవస్థానంలో ఈఈగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఒక సంవత్సరం డిప్యూటేషన్‌పై శ్రీశైల దేవస్థానానికి బదిలీ చేస్తున్నట్లు అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రముఖుల సందేశాలను గ్రహించాలి



రచయితలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

దొర్నిపాడు: ప్రముఖులెందరో స్ఫూర్తిదాయకమైన సందేశాలను ఇచ్చారని.. వాటిని విద్యార్థి దశ నుంచే గ్రహించాలని గ్రంథాలయాధికారి అఖిలాబేగం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సెమినార్, రచయితల సందేశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నీటివిడుదల తగ్గింపు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కేవలం ఆరువేల క్యూసెక్కులను ఎస్సార్‌బీసీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం శ్రీశైలం జలాశయంలో 875.10అడుగుల నీటి మట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 874.10అడుగుల నీటిమట్టం నమోదైనట్లు తెలిపారు.

నిప్పులవాగుకు 779క్యూసెక్కులు

లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 779క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. సుంకేసుల డ్యామ్ నుంచి కేసీ కాల్వకు 2,200క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,344క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు.

తెలుగుంగకు నాలుగువేల క్యూసెక్కుల నీరు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి తెలుగుగంగకు(వీబీఆర్) 4,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర ఆదివారం తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి 6,000 క్యూసెక్కులు ఎస్‌ఆర్‌ఎంసీ ద్వారా బాకనచెర్ల క్రాస్ రెగ్యులేటరు వద్దకు చేరుతున్నాయన్నారు.

23న కార్తీక వనభోజన మహోత్సవ రాష్ట్ర మహాసభ



కర పత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: ఈనెల 23వ తేదీన కర్నూలులో హలో బీసీ చలో కర్నూలు కార్తీక వనభోజన మహోత్సవ రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వేంపెంట రాంబాబు, బి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల బీసీ సోదర సోదరీమణులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడు డబ్బి వెంకటస్వామిగౌడ్, గౌరవాధ్యక్షులు బి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మన్నెం బాలస్వామియాదవ్, ఆత్మకూరు పట్టణాధ్యక్షుడు టి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన మహిళ అరెస్ట్

డోన్ రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో చోరీకి పాల్పడిన మహిళను అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ బిందు మాధవి ఆదివారం తెలిపారు. నెల క్రితం డోన్ రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్ వద్ద వెల్దుర్తి మండలం ఎల్.బండ గ్రామానికి చెందిన మాధవ కిట్టుకు చెందిన 12 తులాల వెండి పట్టీలు చోరీకి గురైంది. సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగను గుర్తించారు. స్టేషన్‌లో నిఘా ఉంచారు. సదరు మహిళ శనివారం డోన్ రైల్వేస్టేషన్‌కు రావడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కర్నూలు జిల్లా నరసింహరెడ్డినగర్ కాలనీకి చెందిన పేరు పోగు దేవమణిగా గుర్తించారు. చోరీ చేసిన 12 తులాల వెండి పట్టీలను స్వాధీనం చేసుకుని యజమానులకు అప్పగించారు. దేవమణిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కోలుకోలేక విద్యార్థి మృతి

సి.బెళగల్: పాఠశాలకు వెళ్లడంలేదని తండ్రి మందలించడంతో మనస్థాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి కోలుకోలేకు మృతి చెందినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్‌ఐ తెలిపిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి. బీసీ కాలనీలో నివాసము ఉంటున్న కురువ పరమేష్ పెద్ద కుమారుడు శివప్రసాద్ (17) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. అయితే శివప్రసాద్ పాఠశాలకు సక్రమంగా వెళ్లడంలేదని తండ్రి మందలించడంతో ఈనెల 15వ తేదీన ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగాడు. కల్లందొడ్డిలో అపస్మారక స్థితి పడిఉండగా గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కోలుకోలేక విద్యార్థి శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం మృతుడి తండ్రి పరమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

కర్నూలు(సెంట్రల్): బాలికను లైంగికంగా వేధించిన అజయ్ అనే వ్యక్తిపై రెండో పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నగరంలోని చదువుల రామయ్య నగర్‌లో నివాసం ఉంటున్న 17 ఏళ్ల బాలికను నిందితుడు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న రెండో పట్టణ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.